# బిసాతీ

### తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి గారు

ఉద్యానముదగ్గర శైలమాలికకింద సస్యసమృద్ధిగల చిన్నగ్రామమున్నది. వసంతఋతువులో చల్లగాలి దాన్నిస్పృశించి, అక్కడికుటీరాలనిండా పుష్పసౌరభాలు నింపుతుంది. సరోవరపు హిమశీతలప్రవాహము తన బాహుపాశాలతో ఆగ్రామాన్ని గట్టిగాబంధించుకొనిఉన్నది. ఆరమణీయప్రదేశాన నిరంతరమూ మధురధ్వని వినబడుతూఉంటుంది. దానిలోపల బుల్‌బుల్ పక్షులకలనాదము మూర్ఛనకల్పిస్తుంది.

దానిమ్మపూల అరుణకాంతి సంధ్యారాగములో మరింత ఉజ్జ్వలముగాఉన్నది. షీరీన్ దానిమ్మచెట్లకింది శిలాఖండముమీదకూర్చుని ఎదటి గులాబీపొద చూస్తున్నది. అందులో బుల్‌బుల్ పక్షులు పాడుతున్నవి. అవి గాలితోపాటు గుంజనముచేస్తూ తమ కలవరముతో దిక్కులునింపివేస్తున్నవి.

షీరీన్ చప్పున తనమేలిముసుగు తొలిగించింది. ప్రకృతిప్రసన్నమై హసించింది. ఆమె గులాబీపంక్తి నడుమ రాణీలాగ శోభాయమానముగాఉన్నది. మకరందము నోటినిండాఉండడముచేత రెండునల్లతుమ్మెదలు గులాబీలోనుంచి బయటికిరాలేకపోయినవి. తుమ్మెదలరెక్కలు ఆడడములేదు. ముళ్ళపొదలని లక్ష్యపెట్టక బుల్‌బుల్ వాటిలో జొరబడడమూ, ఎగిరిపోవడమూ ఆమె తన్మయత్వముతోచూస్తున్నది. ఆమె సఖి జలేఖారావడముచేత ఆమెభావన విచ్ఛిన్నమయింది. మేలిముసుగుతొలిగిస్తూ జలేఖా "షీరన్, నీచేతులమీదవాలిఉండే బుల్‌బుల్ ఈరోజుల్లో కనబడడంలేదే" అన్నది.

షీరన్ నిట్టూర్పువిడిచి "నిండుశీతాకాలంలో తన జట్టుతో మైదానంవైపువెళ్ళిపోయింది. వసంతుడు వచ్చినా అది తిరిగిరాలేదు" అన్నది.

"ఇవన్నీ హిందూస్థానంలోకి చాలా దూరం పోతవి. నిజమేనా? షీరీన్?"

"అవును ప్యారీ! నిరాఘాటంగాతిరగడం వీటికి చాలారుచిస్తుంది. ఈజాతికి స్వాతంత్ర్యం చాలాయిష్టం"

"ఉంగరాలుతిరిగే ముంగురులల్లో దాన్నిఎందుకు నీవు బంధించలేదు?"

"నాపాశము సళ్ళిపోతూఉంటుంది."

"మంచిది. బుల్‌బుల్ తిరిగివస్తుందిలే. విచారించకు. ఇంటికిపోతున్నాను."

షీరీన్ శిరఃకంపముచేసింది.

జలేఖా వెళ్ళిపోయింది.

* * *

ఆపర్వతప్రదేశాన గగనమార్గమున సంధ్య తనరంగు పట్టు వ్యాపింపజేస్తూఉండగా, విహంగాలు బారులుదీర్చి కలరవాలతో ఎగురుతూ పొదరిళ్ళవైపు మరలుతూఉండగా, కోమలములైన వాటిరెక్కలవల్ల వాయువు తరంగాయితమవుతూఉండగా, గులాబీపువ్వు గాఢసౌరభము వెదజల్లుతూ పచ్చనిపట్టులో తలదాచుకొనగోరుతూఉండగా, షీరీన్‌కుమారి ఆశాన్వితదృష్టి నీలిమావృతమైన కనురెప్పలలో అంతర్హితముకాసాగింది. ఆమె మేలుకొనిఉండేకలలు కనజొచ్చింది.

హిందూస్థానములో సంపన్నమైననగరములో ఒక యువకుడు వీపుమీద మూటవేసికొని ఒకగల్లీలో తిరుగుతున్నాడు. ఆహారములేక బడలికచేత అతని ముఖము వెలవెలబోతున్నది. అలిసిపోయి అతను ఎవరిగుమ్మములోనోకూర్చున్నాడు. కొద్దిగా సరుకు అమ్మి ఆరోజుఖర్చులకు పైసాసంపాదించవలెననే ఆదుర్దా, జాలిగొలిపే ఆతనిమాటల్లో జాలువారుతున్నది. కాని ఆయింటియజమాని "అరువుఇవ్వడానికి వీలులేకపోతే మూటయెత్తుకోవచ్చు. తెలిసిందా?" అన్నాడు.

"అరువివ్వలేను."

"అయితే నాకేమీఅక్కరలేదు."

షీరీన్ ఈవిధముగాభావించి ఉలికిపడ్డది. సరుకులుతీసుకొని బిడారువెంట ఖైబరుకనుమలో ఆమె మానసికసంచారముచేస్తున్నది.

హిందూస్థానములో ప్రతిగృహస్థుదగ్గరా అవసరము లేకపోయినా ఆయువకుని సరుకులన్నీకొనడానికి తగినడబ్బు ఉంచుదామనుకొన్నది. అమాయికురాలు షీరీన్ నిస్సహాయ. ఆమెతండ్రి కఠినుడైన కొండ సరదారు. ఆమె తలవంచుకొని ఏదోఆలోచిస్తున్నది.

సంధ్యవేళ దాటింది. పక్షులకలరవాలు అగిపోయినవి. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసలతోపాటు వాయుగమనముకూడా మందగించింది. ఆమె రాతికి చేరబడ్డది.

దాసీవచ్చి ఆమెనుఓదార్చి "బేగంసాహేబా, పిలుస్తున్నారు. పదండి. గోరింటాకువచ్చింది" అని చెప్పింది.

*　　　*　　　*

కొన్నినెలలుగడచినవి. ధనవంతుడైన ఒకానొక సరదారుకు షీరీనునిచ్చి వివాహము చేశారు. సెలయేటి ఒడ్డునఉన్న ఆమెతోటలో రాత్రిగడిచిపోయింది. వసంతవాయువు ఒక్కొక్కతాకుతో వందలకొద్ది పూలు రాల్చుతున్నది. మకరందము కురుస్తున్నది. బుల్ బుల్ పక్షులు వాయుకాఠిన్యానికి క్రందనము చేస్తున్నవి. షీరీన్ అన్నింటినీ సహిస్తున్నది. సరదారు ముఖాన ఉత్సాహము వెల్లివిరుస్తున్నది. మొత్తము మీద ప్రభాతము రమణీయముగానేఉన్నది.

దుర్బలుడైన పొడుగాటి యువకుడు శోకదువీపుమీద మూటవేసుకొని యెదటికివచ్చికూర్చున్నాడు. షీరీన్ అతన్నిచూచింది. అతను ఎవరివైపూచూడలేదు. మూటవిప్పి సరుకులనుగురించి చెపుతున్నాడు.

తనప్రియురాలికి బహుమానముచెయ్యడానికి సరదారు గాజుగిన్నెలూ, కాశ్మీరదేశవస్తువులూ కొన్నాడు.

షీరీన్ మాట్లాడలేదు. ఆవిడహృదయములో ఆందోళనపుట్టింది. సరదారు వస్తువులఖరీదు అడిగాడు.

"నేను కానుకలిస్తాను, అమ్మకంచెయ్యను. ఈ పరదేశకాశ్మీరవస్తువులు ప్రత్యేకం ఏర్చితెచ్చాను. వీటికి వెలలేదు. మనస్సుకునచ్చినవి. అమ్మేవికావు" అని యువకుడుచెప్పాడు.

"అయితే నాకక్కరలేదు. తీసుకుపో. మూటెత్తుకో" అని సర్దారు తీక్ష్ణముగాఅన్నాడు.

"మంచిది. తీసుకుపోతాను. అలిసిపోయివచ్చాను. కొంచెము విశ్రాంతితీసుకోనివ్వండి. కాస్త కాళ్ళూ చేతులూ కడుక్కుంటాను"అని యువకుడు నీరునిండుతున్న కళ్ళుత్రిప్పుకొని లేచాడు.

అతను సెలయేటివైపువెళ్ళిఉంటాడని సరదారనుకొన్నాడు. బిసాతీ ఎంతసేపటికీతిరిగిరాలేదు. అగాధమైనదుఃఖముఅనుభవిస్తూ గుండెలమీద చెయ్యివేసుకొని షీరీన్ గులాబీపొదలవైపుచూస్తున్నది. కన్నీళ్ళవల్ల ఆమెకు ఏమీ కనబడడము లేదు. సరదారు ప్రేమతో ఆవిడభుజముమీద చెయ్యివేసి "ఏమిటి చూస్తున్నావు?" అనిఅడిగాడు.

"పెంపుడుబుల్ బుల్ ఒకటి చలికాలంలో హిందూస్థానంవైపువెళ్ళి ఈఉదయమే తిరిగివచ్చి కనబడ్డది. అది నాదగ్గరకివచ్చినప్పుడు దాన్నిపట్టుకొందామనుకొంటే కొండగుహవైపు ఎగిరిపోయింది!"

ఆమె గద్గదస్వరముతోఅన్నది. అయితే మాటలు చాలా నిబ్బరముగాపలికింది. సరదారునవ్వి "బుల్ బుల్ కోసం పూలపొదల్లోచూస్తున్నావా? వింతగా ఉంది!" అన్నాడు.

బిసాతీ తనసామాన్లువిడిచిపెట్టివెళ్ళాడు, తిరిగి రాలేదు. షీరీన్ మూటదింపించిందికాని ఖరీదుఇవ్వలేదు.

—శ్రీజయశంకరప్రసాదు హిందీకథకుఅనువాదము.